


# ఉష్ణ తీరాలు

కొటూరు రవీంద్ర త్రివిక్రమ

జగన్నాథరావు నన్ను పెంచి పెద్దచేసిన వాడు. బంధుత్వ రీత్యా, వరసకి నాకు బాబాయి—అంటే నీకు తాతగారి వరస. ఆయనకి మనం చాలా ఋణపడి ఉన్నాం. హైదరాబాదులో కంటి శుక్లాల వైద్యం కోసం వొస్తున్న ఆయనకి నువ్వు అన్ని విధాలా సహాయంచేసి, మన కుటుంబం ఆయన పట్ల చూపాల్సిన గౌరవాదరాలకు వన్నె తెస్తావని నా నమ్మకం...."

చక్రవర్తి విసుగ్గా ఆ ఉత్తరాన్ని ఓ మూలకి గిరవాటేశాడు.

అది సరిగ్గా వెళ్ళి, చెత్తబుట్ట పక్కనే పడింది.

'ఈ ముసలాళ్లకి వేరే పనిపాటా ఉండదు కాబోలు. ఏదో వంకతో హైదరాబాదు చూడాలని వొస్తున్న ముసలాడు వారమే ఉంటాడో, రెండు వారాలు ఉంటాడో ఎవరికి తెలుసు? ఒకే వయస్సుగల వాళ్లయితే కంపెనీగా ఉంటుంది. మైగాడ్! డొక్కు తాతయ్యతో ఈ గదిలో చివరిదాకా ఎలా గడపాలో. అంతవరకు రావొద్దనీ, వెళ్లాక చెబుతానని మల్లిక, శైలజ, అరుణలకి చెప్పాలి. పొరపాటున వొస్తే కొంప మునిగిపోతుంది. ముసలాడు నాన్నగారి చెవిని వేస్తే, తన చెవి మెలేసి పెళ్లి చేసెయ్యగలరు! బెంగగా ఉడుక్కున్నాడు.

అప్రయత్నంగా క్యాలెండరు చూశాడు. పద్దెనిమిది అంటే రేపే ఆయన వచ్చేది!

అతని గుండెల్లో రైలు కూత కొట్టింది.

* * *

జగన్నాథరావుకి ఆ గది బాగా నచ్చింది.

మేడమీద— విశాలంగా, నాలుగు మంచాలు పట్టేంత జాగాలో రెండు మంచాలున్నాయి. షెల్ఫుల్లో 'లా' పుస్తకాలు నీట్‌గా ఉన్నాయి. టేబుల్ కూడా అందంగా సర్ది ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే— అదసలు బ్రహ్మచారి గదిలా లేనే లేదు! ఆ గదికి 'అటాచ్‌డ్'గా కిచెన్, బాత్, లావెట్రీ లున్నాయి. ఏ అవసరానికీ మేడ దిగే పనిలేదు.

గది దాటగానే విశాలమైన చప్టా. అక్కడో చిన్న పెళ్లి చెయ్యొచ్చు. పిట్టగోడ క్కాస్త అవతల, సూర్య చంద్రుల రాకపోకల్ని అందంగా చూపించే కొబ్బరి, పోకచెట్ల బారు లున్నాయి. ఆరుబయట కుర్చీ వేసు క్కూర్చుంటే కళ్లకీ, మనసుకీ కలిపి పసందయిన విందు!

ఆ దృశ్యాలు చూస్తూ అలాగే నిల బడిపోయిన జగన్నాథరావ్, చక్రవర్తి పిలుపుకి తేరుకున్నాడు.

"స్నానం చేస్తారా?"

"చేస్తాను."

అతని వెనక లోపలి కెళ్లేడు.

బాత్‌రూమ్ ఎటుందో చూపించి, కుర్చీలో కూలబడ్డాడు చక్రవర్తి. అతని ఆలోచనలు జగన్నాథరావ్ చుట్టూ తిరుగుతున్నాయ్.

"ముసలాడు రిటైరయిన హీరోలా ఉన్నాడు. ఒకప్పుడు బాగా బ్రతికినట్లే కనుపిస్తున్నాడు. ఇది అతని మొదటి అభిప్రాయం.

ఆలోచనలు ముందుకి సాగాయి.

తనిక్కడ చార్టెర్డ్ ఎక్కవుంటెన్సీ చేస్తున్నట్లు తండ్రి చెప్పేఉండాలి. ఆ

వంకతో బయటకి తను వెళ్లకుండా ఒక్కణ్ణే పంపిస్తే సరి. ఎక్కడికి వెళ్లాలన్నా 'ఆటో'లు ఉండనే ఉన్నాయి గనక, వెంట తను ఉండి తీరాల్సిన అవసరం లేదు.

భోజనం సంగతి? అవును....ఎలా?

ఆచారం, ఆవకాయ లేకపోతే, హోటల్ క్యారియర్‌లో తినమంటే సరి! అలా కాదంటే 'మీ ఇష్టం' అనేస్తే, ఆయన తంటాలు ఆయనే పడతాడు.

రూమ్ తాళం సంగతి.

డూప్లికేట్ ఉంది గనక సమస్య లేదు.

ఎవరికి వీలైన టైములో వాళ్లొచ్చి పోతుండొచ్చు.

దట్సాల్ రైట్.

ఎలాగోలా కాలక్షేపం చేసెయ్యొచ్చు.

జగన్నాధరావ్ బాత్‌రూమ్‌లోంచి తిరిగి వచ్చి, ప్లాస్టిక్ తాడుమీద బట్టలు ఆరేసాడు. తల 'నీట్'గా దువ్వుకుని, తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"సో....నీ పేరు చక్రవర్తి. ప్రస్తుతం అకౌంట్స్ సామ్రాజ్యాన్ని పాలిస్తున్నావ్. ముఖ్య పట్టణం భాగ్యనగరం.... అంతేనా?" తాజాగా ఉన్న ఆయన మొహంలో నవ్వు మెదుల్తోంది.

లోపల 'ఈ వెధవజోకులకి నేను నవ్వాలి కాబోలు' అని చీదరించుకుని, పైకి "పాత జోకులేస్తున్నారు మరీని" అన్నాడు అప్పటికయినా సిగ్గుపడతాడేమోనని.

సిగ్గుమాటెలా ఉన్నా, ఆయన తీవిలో గానీ, పోజులోగానీ కించిత్ కూడా మార్పులేదు. సమాధానం ఇవ్వకుండా నవ్వుచెరగని మొహంతో "ఊఁ".... అని ఎదురుగా ఉన్నా పేపరందుకున్నాడు.

చక్రవర్తి తనబాణం వేస్టయినందుకు కాస్త ఆశాభంగం చెందాడు.

అతనికెందుకనో జగనాధాన్ని ఏదో విధంగా ఏడిపించి, నిర్లక్ష్యం చేసి, తన ప్రశాంతతకీ, ఏకాంతానికీ అడ్డం వచ్చినందుకు శిక్షించాలని గట్టిగా అనిపించింది! అతని భావాలన్నీ మొహం మీద ప్రతిబింబిస్తున్నాయి.

జగన్నాధం అక్షరాలు చూడటమే లేదు.

పేపరు మాత్రం కళ్ల కెదురుగానే ఉంది.

'ఏమిటీ కుర్రాడి ధోరణి?' అనుకుంటూ, తనలో తను అతని మనస్తత్వాన్ని అంచనా వేసుకోసాగాడు.

తను కనీసం పదిరోజులుండాలనుకుంటున్నాడు.

కుర్రాడి తరహా చూస్తే, అందుకు సహకరించేలా లేడు. వీళ్ల నాన్న తత్వానికీ వీడికీ ఎక్కడా పోలికే లేదు.

వాడు తనని చూడగానే,క్షణం భూమి మీద నిలవడు. "బాబాయ్, బాబాయ్" అంటూ అడుగడుక్కీ తనని కనిపెట్టుకుని ఉంటూ, అంగరక్షకుడిలా అన్నీ తనే చూసుకుంటుంటాడు.

తనవల్ల వాడు పొందిన ఉపకారం మాత్రం తక్కువా?

సొంత కొడుకు కన్నా అధికంగా చూసుకున్నాడు.

డబ్బు గురించి ఎలాంటి ఇబ్బందీ పడకుండా ముందుగానే అన్నీ ఊహించుకుని చేతికిచ్చేవాడు.

ఇన్ని చేసినందుకు వాడిలో మిగిలిన కృతజ్ఞతే చాలు తనకి,కొండంత తృప్తి! ఉపకారాలు పొందినవాళ్లంతా కృతజ్ఞులై ఉండటం సాధ్యమా? స్వాతి చినకులన్నీ ముత్యా లవుతున్నాయా? చూద్దాం.... కుర్రాడు కద? వాడికీ ఓ అవకాశం ఇద్దాం.

ఆ సాయంత్రం, అలవాటుగా 'లాంగ్ వాకింగ్'కి వెళ్లి మెట్లెక్కి వస్తూ మేడపైన ఆడగొంతు పెద్దగా నవ్వటం వినిపించి అలాగే నిలబడి పోయాడు, జగన్నాధరావ్.

"ఎవరై ఉంటారు?" కుతూహలంగా పైకి నడిచాడు.

తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

"ఇంకా ఎన్నాళ్లు బాబూ, మనకీ రాబిన్‌సన్ క్రూసో బాధ? ఎప్పుడు వెళతాడు మీ ముసలాడు?" ప్రశ్నిస్తోంది ఆడగొంతు.

"గట్టిగా అనకు, వచ్చే వేళయింది." చక్రవర్తి.

"ఇట్లా భయభయంగా మాట్లాడుకోవటం బోరుగా ఉంది."

"అవును. నాకూ అంతే కానీ హెల్ప్‌లెస్!"

"ఓ. కె. డియర్! వొస్తాను మరి...."

"ఊరికే వెళ్లిపోతే ఎలా? నా మామూలు ఇవ్వవా?"

"ఊఁ.... డోంట్ బీ సిల్లీ.... అబ్బ వదులు....చక్రీ...."

స్పష్టంగా- ముద్దుపెట్టుకున్న సవ్వడి విన్పించింది (బహుశ పెనుగులాట వల్ల కావొచ్చు....)

జగన్నాధరావ్‌కి కిందకివెళ్లే అవకాశం లేదు. తప్పుకునే టైము లేక అలాగే నిలబడిపోయాడు.

దాదాపు ఒకళ్లనొకళ్లు హత్తుకుని తలుపు తెరిచి, షాక్ తిన్నట్లు విడిపోయారు.

జగన్నాధరావే "ఎక్స్యూజ్ మీ" అంటూ వాళ్ల మధ్య ఖాళీలోంచి లోపలికెళ్లిపోయాడు. ఆ అమ్మాయిని పంపించి తిరిగొచ్చిన చక్రవర్తి ఏదో పుస్తకం తిరగేస్తూ మౌనంగా ఉండిపోయాడు.

జగన్నాధరావ్ రేడియో వింటూ కళ్లుమూసుకు పడుకున్నాడు. ఆయన అడిగితే చెబుదామని చక్రవర్తీ, అతను చెబితే విందామని జగన్నాధరావ్ ఊరుకుండిపోయారు.

ఎవరూ ఆ విషయం ఎత్తకుండానే కాలం జరిగిపోయింది.

* * *

"గురువుగారూ నమోన్నమః".... అదిరిపడ్డాడు జగన్నాధరావు.

అందమయిన హుస్సేన్‌సాగర్ మీద నుండీ దృష్టిని ఆ గొంతు విన్పించిన వైపు మళ్లించాడు.

అలాగే ఆశ్చర్యంగా చూస్తున్నాడు అతని కేసి.

"నేనండీ.... మీ శిష్యుడు ప్రజాపతిరావ్‌ని.... మీ కన్యాశుల్కం నాటకం టీములో గిరీశాన్ని !"

"నువ్వటోయ్ ప్రజాపతీ! చాలా మారిపోయావ్ సుమా...." నవ్వుతూ ప్రేమగా చెయ్యందుకుని బెంచీమీద తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు జగన్నాధరావు.

"మారిపోకనేమండీ? ఇప్పటి మాటా? మీ టీమ్ వదిలి ముప్పైయేళ్లు దాటింది. ఇక్కడే హైదరాబాదులో స్థిరపడిపోయాను.."

"రంగు వేసుకుంటున్నావా?"

"ఆహాఁ.. అది మానేది లేదు. చివరి శ్వాస వరకు నటిస్తూనే ఉంటానని శపథం చేశాను.." నవ్వాడు.

ఇద్దరూ పాతరోజుల జ్ఞాపకాలు తిరగతోడుకున్నారు. మధ్యలో పల్లీలు కొనుక్కున్నారు. కమ్మగా కాలం దొర్లిపోతుండగా, జగన్నాధరావ్‌కి మెరుపులా చిన్న ఊహ మెరిసింది.


రూమ్, చక్రవర్తి అనాదరణ గుర్తొచ్చాయి. ఆడపిల్లల పట్ల అతని చాపల్యం గుర్తొచ్చింది.

"చూడు ప్రజాపతీ! నాకో చిన్న సాయం చెయ్యగలవా?"

"మీ అంతటివా రడగటం నేను కాదనటమూనా? చెప్పండి" భక్తిగా అన్నాడు.

* * *

పిట్టగోడమీదకి ఒంగి బజారుకేసి, వచ్చేపోయే వాహనాల్నీ, అందమైన అమ్మాయిల్ని చూస్తున్న చక్రవర్తి ఉలిక్కిపడ్డాడు.




సరిగ్గా అతనింటి ముందు చాలా ఖరీదయిన కారు ఆగింది.

అందులోంచి ఠీవిగా, దర్జాగా ఉన్న వ్యక్తి నేరుగా మెట్లెక్కి తన గదివైపే వస్తున్నాడు! చప్పున లేచి ఎదురు వెళ్లాడు.

"ఎవరు కావలి సార్?"

అవతలి వ్యక్తి మొహంలో అందమయిన మందహాసం మెదిలింది.

"ఇఫ్ అయామ్ నాట్ రాంగ్.. నీ పేరు చక్రవర్తి! అవునా?"

"అవునూ.." ఆశ్చర్యంతో తబ్బిబ్బవుతూ జవాబిచ్చాడు.

"నేను పరాయివాణ్ణి కాదులే.. పద అలా కుర్చీల్లో కూర్చుందాం.." చొరవగా ముందుకి వెళ్లాడు.

ఇద్దరూ కూర్చున్నాక,

"నేను జగన్నాధరావుగారవబడే మీ తాతగార్కి బాల్యస్నేహితు... శ్రీపతి అంటారు. దాదాపు ముప్పయి కోట్ల ఖరీదు చేసే పరిశ్రమలున్నాయి నాకు.."

చక్రవర్తి సర్దుకు కూర్చుని, శ్రద్ధగా వినసాగేడు.

"నేనింత గొప్పవాడిని కావటానికి కారణం మీ తాతగారే?"

'మీ తాతగారు' ఈ సంబోధన ఇప్పుడు మధురంగా ఉంది.

"ఒక కోటీశ్వరుని కూతుర్ని ఇద్దరం గాఢంగా ప్రేమించాం. ఆ అమ్మాయికి మీ తాతమీద మక్కువ ఎక్కువ. మీ తాతకి నేనంటే మక్కువ. అందుకని ఆ అమ్మాయి మనసు మార్చి నాకు కట్టబెట్టాడు.. కలతలేవయినా తలెత్తుతాయని మళ్లీ మా గుమ్మం తొక్కని మహోన్నతుడు మా జగన్నాధం.. మొదట్నించీ ఇతరుల సుఖసంతోషాలే పరమావధిగా కృషి చేసిన మనీషి.. వాడి గురించి ఎంత చెప్పినా తక్కువే!" తన్మయంగా అన్నాడు.

చక్రవర్తికి జగన్నాధరావు మీద అంతవరకు ఉన్న అయిష్టత మంచులా కరిగిపోసాగింది.

"దేవుడు నాకు అన్నీ ఇచ్చి ఒక్కటే లోపం చేశాడు.."

...క్కన ఆయన కళ్లలోకి కుతుహలంగా చూశాడు, చక్రవర్తి.

"మాకు సంతానం లేదు! విధిలేక ఓ అనాధపిల్లని పెంచుకున్నాం. ఆ పిల్ల కిప్పుడు పద్దెనిమిదేళ్లు.. పెళ్లి చెయ్యాలి.. కానీ, కులమతాల నిషానుండీ బయటపడని శిష్టసమాజంలోంచి ఏ బుద్ధిమంతుడు ముందుకు వొస్తాడు?"




'నేను చేసుకుంటాను' అని గట్టిగా అనాలనిపించి కూడా, ఎవరో గొంతు నొక్కినట్లు ఉండిపోయాడు చక్రవర్తి.

"రావొచ్చు.. కానీ, వచ్చేవాడు కేవలం డబ్బుకోసం వొస్తాడు. ఆ పిల్ల గొంతు చేతులారా కరెన్సీనోట్ల పదునుతో కోసినట్లవుతుంది. ఈ పరోక్ష హత్య నేను చెయ్యలేను. నా రక్తం పంచుకోకపోయినా, నన్ను నాన్న అని పిలిచి నాలోని పితృహృదయాన్ని స్పందింపజేసి, నాకు తండ్రి హోదాని కల్పించిన ఆ అమాయకురాలికి అన్యాయం చెయ్యలేను. అందుకే మా జగన్నాధం ఇక్కడికి వొస్తున్నానని రాయగానే, కొండంత సంబరంతో వెతుక్కుంటూ వొచ్చాను. వాడు నాకు పరిష్కారం చెప్పగలడు. అసలు వాడి పాతపద్ధతులు మార్చి బలవంతంగా మా ఇంటికి లాక్కెళ్లాలని వచ్చాను. నేను ఇంద్రభోగాలు అనుభవిస్తూ, అందుకు కారణమైనవాడి నిలా దిక్కులేని మనిషిగా, నేనుండే ఊళ్లో ఉండనిస్తానా? ఇంపాసిబుల్! ఆ ఉత్తరం ఆలస్యంగా రాకపోతే మూడ్రోజుల ముందే వచ్చేవాణ్ణి."

చక్రవర్తికి ఉరిశిక్ష అనుభవిస్తున్నట్లైంది.

తను నిర్లక్ష్యంచేస్తూ, ఎన్నోమాట్లు సిల్లీగా ప్రవర్తించి, బలవంతంగా వెళ్లగొట్టి హాయిగా గాలి పీల్చుకోవాలనుకున్నది ఈ మహావ్యక్తి ఆరాధించే మహనీయుణ్ణా?! గాడ్....

"బైదిబై! ఏడీ మా జగన్నాధం?" అప్పుడే గుర్తుకు వచ్చినట్లు అడిగాడు.

"అలా బిర్లామందిరంవైపు వెళ్లారు. వస్తుండొచ్చు.." తడబాటుగా చెప్పాడు.

ఇబ్బందిగా గడియారం చూసుకున్నాడు.

క్రింద కారు హారన్ మ్రోగింది.

నవ్వేడు— "మా డ్రైవర్‌కి కూడా టైమ్‌సెన్స్ నేర్పాను. అందుకే వాడు హారన్ కొడుతున్నాడు. నాకు మరో పది నిముషాల్లో బోర్డుమీటింగు ఉంది. చాలా ముఖ్యమయిన విషయాలు డిస్కస్ చెయ్యాలి. మళ్లీ వచ్చి కలుస్తానని చెప్పు. వస్తా" లేచాడు.

చక్రవర్తి చాలా వినయంగా "అలాగే సార్" అని ఆయన్ని సాగనంపేడు.

కారు కనుమరగయ్యే వరకు చూసి, రూమ్‌లోకి వెళ్లాడు.

ఎదురుగా జగన్నాధరావ్ బెడ్ కనుపించింది. దుప్పటి చెదిరి ఉంది. సరిజేశాడు. ఆయన సరంజామా అంతా 'నీట్'గా సర్దాడు.

నిలువెత్తు అద్దాన్ని శుభ్రంగా తుడుస్తూ నవ్వుకున్నాడు.

ఈ అద్దం ముందు నిలబడి, ఈల వేసుకుంటూ, స్టయిల్‌గా తల దువ్వుకుంటూ, పరోక్షంగా ఆయన ముసలితనాన్ని వెక్కిరించాడు. కానీ.. ఇప్పుడా పని చెయ్యమన్నా చెయ్యలేదు.

మెట్లమీద ఎవరో వస్తున్న చప్పుడు వినిపించింది.

చూస్తే... ఆయనే!

చటుక్కున మొహమంతా నవ్వు విస్తరించింది.

"రండి తాతగారూ ఇంతకు ముందే మీ కోసం శ్రీపతిగారని మీ స్నేహితులొకాయన వచ్చారు.."

మధ్యలోనే అడ్డుకుని "దార్లో కనిపించాడులే.. రానని చెప్పేశాను.." టూకీగా అని, అలసటగా మంచం మీద వాలాడు జగన్నాధరావు. చక్రవర్తి ఓ క్షణం తటపటాయించినా, మెల్లగా ఆయన విడిచిన చెప్పులు తీసుకు వెళ్లి మూలగా ఉంచాడు. లోపలికి వెళ్లి స్నానానికి వేడినీళ్లు రెడీ చేశాడు. టవల్స్, సబ్బు బాత్‌రూమ్‌లో ఉంచాడు.

అన్నీ ఎరగనట్లు గమనిస్తుండిపోయాడు జగన్నాధరావ్.

ఆయన పెదవుల మీద కనీకనిపించకుండా మందహాసం మెదిలింది.

* * *

రైలు కూత వేసింది.

ఆ సంకేతం అర్థమయిన వాడిలా "ఉంటాను తాతగారూ! వెళ్లగానే ఉత్తరం రాయండి. నాన్నగార్ని కలుసుకుంటే నేను అడిగానని చెప్పండి.." చక్రవర్తి చెయ్యి గాల్లో కదిలించాడు.

రైలు కదలి ముందుకు వెళ్తోంది.

మాటలు రొదలో కలిసిపోతున్నాయి.

గాలిలో చేతులు కదుల్తున్నాయ్.

భారంగా ఇంటిదారి పట్టాడు చక్రవర్తి.

దారంతా ఆలోచనలే.

ముసలాయన పట్ల హఠాత్తుగా తన ప్రవర్తన మార్చుకుని, అతి మర్యాదలు చేయటాన్ని, అంతరాత్మలోంచి ఎవరో వేలెత్తి చూపి పగలబడి నవ్వుతున్నారు.

'నువ్వు ముసలాడికి వల వేశావ్... వల వేశావ్..' అదృశ్యంగా ఎవరో చెవుల్లో అంటున్నారు.

ఇంటికి చేరి, డస్సిపోయినట్లు కుర్చీలో వాలిపోయాడు. కాళ్లు టీపాయ్ మీద ఉంచి ఇంటి కప్పుకేసి చూస్తుండి పోయాడు. ఏవేవో అర్థంలేని ఆలోచనలు.

శ్రీపతిగారి కారులో రావటం, ఆయనతో జన సంభాషణ గుర్తొచ్చాయి.


'అరే.. ఆయన ఫోను నెంబరు సైతం అడగలేదు.. కనీసం కాంటాక్టులో ఉండే వాణ్ణి' అనుకున్నాడు. మళ్లీ టెలిఫోన్ డైరక్టరీ చూస్తే సరి అనుకున్నాడు.

జగన్నాథరావ్ తన మర్యాదలకి కరిగితే, శ్రీపతిగారికి తన గురించి పరోక్షంగా నైనా 'రికమెండ్' చేస్తాడు. అప్పటికీ తను అన్నాడు కూడా, "ఓ మాటు శ్రీపతిగారి ఫ్యాక్టరీలు చూడాల నుంది.. ఆయనతో చెప్పండి" అని.

ఆయన గంభీరంగా నవ్వి "దేశంలో వాడిని మించినవాళ్లే ఉన్నారు. చూడ దలుచుకుంటే అవి చూడు! కానీ మన వాడనుకునే వాడి దగ్గర పనికవాడు మనిషిగా కనిపించటం నా కిష్టం లేదు..." అన్నాడు. ఆ మాటలు తనని కొంత నిరుత్సాహ పరిచినా, ఆశను వదులుకో లేదు. ఎంతైనా, తను ఆయన పెంచిన కొడుక్కి పుట్టినవాడు! ఆ మాత్రం అభిమానం ఉండకపోదు.

ముప్పై కోట్లు!

మైగాడ్.. తనకా అదృష్టం పట్ట కూడదూ... హాయిగా మహారాజులా....




ఇంపాలా కారులో.. కోరిన దుస్తుల్లో... అడుగడుగునా మగువల జిలుగులతో..- ఊహలతో ఒళ్లు పులకించింది.

శ్రీపతిగారి ఖరీదయిన కూతురు జగన్మోహనంగా, మయూరసింహాసనం మీద కూర్చుని, ఊహాసుందరిగా దర్శన మిచ్చింది!.. నవ్వుతోంది.. తను చేతులు జాచగానే, శ్వేతమయూరంలా తెల్లని పాలదుస్తుల్లో మెల్లగా తన వైపే కదలి వస్తోంది.

అంతలో-ధ్యానభంగం అయింది.

తల త్రిప్పి చూశాడు.

పరాకుగా చెయ్యి తగిలి సైడ్ టేబుల్ మీద నుండీ ఇంగ్లీషు నవల జారిపడింది. అందులోంచి సగం బయటికి వచ్చిన తెల్లటి కవరుమీద తన పేరు కనిపించి కుతూహలంగా తీశాడు. కవరు అంటించి లేదు.

ఉత్తరం బయటికి తీశాడు.

"చిరంజీవి చక్రవర్తీ-

నీతో సూటిగా చెప్పే ధైర్యం లేక ఈ ఉత్తరం రాస్తున్నాననుకుంటే నువ్వు పూర్తిగా పొరబడినట్లే. పిరికితనం ఏమిటో నాకు తెలియదు.

అందుకు ఒక్క ఉదాహరణ చెబితే చాలు నీకు.

మీ నాన్న పుట్టిన ఘడియ మంచిది కాదనీ, దురదృష్ట జాతకుడనీ అందరూ ఈసడించుకునే వాళ్లు. కారణం, వాడు పుట్టిన కొద్దిరోజుల్లోనే కొస్త తేడాతో తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాడు. బంధువులంతా చీదరించుకున్నారు. ఆ అనాథపిల్లాడిని సాకటానికి కనీసం మేనమామ కూడా ముందుకి రాలేదు. చివరికి అనాథశరణాలయం పాలుచేద్దా మన్నారు కొందరు.

అప్పుడు ముందుకి వచ్చిన వాణ్ణి నేను. నాకు కొడుకులు లేకకాదు. కొడుకు లాంటి పసివాడినలా దిక్కులేని వాణ్ణిగా మూఢనమ్మకాలతో అనాథశరణాలయం పాలుజెయ్యటానికి మనస్కరించక చేతుల్లోకి తీసుకున్నాను. తీసుకున్నందుకు ఫలితంగా నా ఇంట్లో, బంధువుల్లో ఎన్నెన్నో విమర్శలు, సమస్యలు ఎదురైనాయి. నిబ్బరంగా ఎదుర్కొన్నాను. వాడిని అందరికన్నా ఎక్కువ ఆదరణతో చూశాను. ప్రయోజకుణ్ణి చేశాను. గెలిచింది నేనే! ఆ గర్వం, ఆనందం, తృప్తి, జీవిత మంతా నిండిఉన్నాయి నాకు.

వాడి కొడుకుగా నీలో నేను ఆశించింది వేరు. చూసింది వేరు. నా ముందు నువ్వు వేసిన వేషాలు చూస్తే, మనసులో

నీమీద జాలివేసింది. నీకు తెలియదు, వయసులో నేను నీకంటే ఎక్కువ వేషాలు వేశాను. రంగస్థల సార్వభౌమగా నాకు బిరుదు ఉంది.

కానీ, జీవితంలో జీవించటానికే ప్రయత్నం చేశాను. ఎందుకంటే నటనతో జీవన మాధుర్యాన్ని చెడగొట్టుకోవడమంత మూర్ఖత్వం ఈ సృష్టిలో మరొకటి ఉండదు గనక. అందువల్ల, ఎవరన్నా నా ఎదుటగా, జీవితంలో నటిస్తుంటే పరమ ఎలర్జీ నాకు. వాళ్ళ ఉద్దేశ్యం ఇతరులు వాళ్ళ వేషవ్వేషాలన్నీ గుడ్డిగా నమ్మేస్తారని.అలాంటి వాళ్ళ మీద చెప్పలేనంత కోపం నాకు.

నీ మీద నాకు అలాంటి కోపమే వచ్చింది.

అయితే, మీ నాన్న మీద నాకున్న ప్రేమ ఆ కోపాన్ని తగ్గించింది. జాలి కలిగించింది.

నీ తప్పు నీకు అర్థమయేలా చెప్పాలనిపించింది.

ఇంకో సంగతి_

దేవుడికే కాదు... ప్రతి మనిషికీ జీవితంలో దశావతారాలు ఎత్తే అవసరం ఏర్పడుతుంది. అయితే, ఇవి ప్రయోజనం పూర్తికాగానే చాలించక పోతే మాత్రం చాలా ఇబ్బంది.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇంకా ఇప్పటికీ ఉంటే, వాళ్ళ అవతారాలకు అంత విలువ ఉండేది కాదేమో! కాలంతో బాటు వచ్చే మార్పుల్లో ఇదీ ఒకటి.

మనిషి ఎత్తే దశావతరాలు ఏమిటా అని నీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మనిషి కాదు మనిషిలోని మనసు దశావతారాలు ఎత్తుతుంది!

బాల్యంలోని మనసు చేపలా, తాబేలులా, వరాహంలా, అనేక పోకడలు పోతుంది. అంతలోనే చురుకు, అంతలోనే మందకొడితనం, మరంతలోనే విషయంలోకి చొచ్చుకుపోయే కుతుహలం, వయసులో మనసు కొంటెగా, విశ్వమంతా అందాలమయంగా, బృందావనంగా, కృష్ణుడి రాసలీలలతో పోటీ పడాలనే తపనతో కొట్టుకుంటుంది. మనసుకి పెళ్ళికాగానే ఒకే ఆలికి అంకితం కావాల్సిన అవసరాన్ని అనుక్షణం ఎదుర్కొంటుంది. కాని వయసు వచ్చిన మనసు అలజడులనుండి శాంతి వెతుక్కుంటూ బుద్ధుడిలా మారాలనుకుంటుంది. చెబుతూ పోతే ప్రతి అవతారాన్నీ మనిషి మనసుకి ఏదో విధంగా అన్వయం చెయ్యవచ్చు. చెయ్యటమే కాదు ఒప్పించనూ వచ్చు.

నీకు ఒక్క విషయం చెప్పక తప్పదు. ఇప్పుడు నేను ముసలివాణ్ణే కానీ, ఒకప్పుడు నీలాగే పడుచువాణ్ణి. దానర్థం_భవిష్యత్తు నీకు ముసలి తొడుగు వెయ్యడానికి కాచుక్కూర్చుందన్నమాట. ఏదో క్యాలెండరులో ఈ నిజం నీకు కనిపిస్తుంది. అందువల్ల వయసు ప్రభావాలకు లొంగిపోయి శ్రీ కృష్ణ లీలలు చూపాలనుకోకు. అవి నీకు భవిష్యత్ జీవితంలో ఎన్నో చిక్కులు సృష్టిస్తాయి.

శ్రీపతిగా వచ్చి నిన్ను ఊరించిన మనిషి, నా కోరికమీద జీవితంలో నటించి నిన్ను దెబ్బకొట్టాడు. అతను మహానటుడు. అంటే కోటీశ్వరుడు కాదు, కానీ, నీలో నేను చూడాలనుకున్న మార్పు ఈ ఉత్తరం నువ్వు చదివాకే తెలిసేది,

ఎలా తెలుస్తుందని అడక్కు.

తెలుసుకోగల తెలివి నాకుంది!

ఆశిస్సులతో

నీ

జగన్నాథరావ్ (తాత)

